క్లుప్తంగా

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నాదెండ్ల: గణపవరం చుండి రంగనాయకులు డిగ్రీ కళాశాలలో సోమవారం ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొదటి సంవత్సరం మాథ్స్-1ఎ, బోటనీ, సివిక్స్ పరీక్ష జరిగింది. 543 మందికి గాను 22 మంది గైర్హాజరు కాగా 521 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా సత్తెనపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ శ్రీలక్ష్మీ, అసోసియేటెడ్ చీఫ్ సూపరింటెండెంట్‌గా కళాశాల వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ చైతన్య వ్యవహరించారు.

రాజకీయ ఉద్రేకాలకు లోనుకావొద్దు

నాదెండ్ల: ఎన్నికల కౌంటింగ్ రోజు గ్రామాల నుంచి ఎవరూ కౌంటింగ్ కేంద్రాల వద్దకు వెళ్ల వద్దని చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాస రెడ్డి, ఇన్‌చార్జి సీఐ సుబ్బారావు చెప్పారు. మండలంలోని సమస్యాత్మక గ్రామమైన తూబాడులో సోమవారం గ్రామస్తులతో పోలీసులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాజకీయ ప్రేరేపిత ఘర్షణలకు దిగి కుటుంబాలకు దూరం కావద్దని హితవు పలికారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం గ్రామంలో ఎలాంటి అల్లర్లు, ఘర్షణలు చోటు చేసుకోకుండా సమన్వయం పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. అల్లర్లకు పాల్పడే వారిపై రౌడీషీట్లు తెరుస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాదెండ్ల ఎస్సై జె.బలరామ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మాన్యం భూముల కౌలు వేలం



బొల్లాపల్లి: మండలంలోని రావులాపురం గ్రామ అటవీ ప్రాంతంలో వేంచేసి ఉన్న శ్రీ మన్నేపల్లి లక్ష్మీ నరసింహా స్వామి దేవస్థానానికి చెందిన మాన్యం భూముల కౌలు వేలంపాట ఈ నెల 30న వినుకొండ పట్టణంలోని శ్రీ ప్రసన్నరామ లింగేశ్వర కోదండ రామస్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తామని దేవదాయ శాఖ అధికారి బి. శ్రీనివాసులు తెలిపారు. ఆ దేవస్థానానికి సంబంధించి పలుగ్రామాల్లో భూములు ఉన్నాయని తెలిపారు. వినుకొండ మండలంలోని కొప్పుకొండతో పాటు మండలంలోని రావులాపురం, గండిగనుమల, మాలపాడు గ్రామాల్లో గల మాన్యం భూములకు 2024-25 సంవత్సరం నుంచి 2026-27 మూడు సంవత్సరాల పాటు కౌలు ఉంటుందని తెలిపారు. కౌలు వేలంపాటలో పాల్గొనే రైతులు దరావత్తు డిపాజిట్ చెల్లించి బహిరంగవేలంలో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ వేలంపాట దేవదాయ ధర్మదాయ శాఖ నియమ నిబంధనలకు లోబడి నిర్వహిస్తామని ఈవో తెలిపారు.

సుబాబుల్ తోటలో అగ్నిప్రమాదం



రొంపిచర్ల: మండలంలోని మునమాక గ్రామ పొలాల్లో సోమవారం ఎ.వెంకటేశ్వర్లుకు చెందిన సుబాబుల్ తోటకు నిప్పు అంటుకుంది. గుర్తుతెలియని వ్యక్తులు సిగిరెట్ తాగి పడవేయటంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు భావిస్తున్నారు. మంటలు ఒక్కసారిగా సుబాబుల్ తోటకు అంటుకున్నాయి. ప్రమాదాన్ని గ్రహించిన స్థానికులు నరసరావుపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

నేడు విద్యుత్ సేవలకు అంతరాయం

నరసరావుపేట టౌన్: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సేవలు నిలిపివేయనున్నట్లు ఏఈ నాగ సురేంద్ర కుమార్ సోమవారం తెలిపారు. ప్రకాష్‌నగర్, 60 అడుగుల రోడ్డు, విద్యానగర్, సీబీఐటీ స్కూల్, సతీష్‌రోడ్, ఆర్టీసీ బస్టాండ్ వెనుక ప్రాంతం, నవయుగ రెస్టారెంట్ వెనుక భాగం, షాలెంనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 7.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సేవలకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ట్రీ కటింగ్‌తో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నరసరావుపేట: పట్టణంలోని బ్యాంకు కాలనీ ఫ్రీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు నరికేసే పనిలో భాగంగా మంగళవారం ఉదయం 7.30 నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.ఏడుకొండలు సోమవారం సాయంత్రం వెల్లడించారు. దీని వలన ప్రకాష్ నగర్‌లోని 60 అడుగుల రోడ్డు, విద్యానగర్, సీబీఐటీ స్కూలు, సతీష్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ వెనుక భాగం, వినుకొండ రోడ్డు నవయుగ వెనుకవైపు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

ఇంటర్ అడ్మిషన్లు షురు

యడ్లపాడు జూనియర్ బాలికల కళాశాల ఆహ్వానం

యడ్లపాడు: పదో తరగతి కృతార్థులై.. సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్న బాలికలు రెండేళ్ల ఇంటర్మీడియట్ కోర్సులో చేరేందుకు యడ్లపాడు ప్లస్‌టూ జూనియర్ కాలేజ్‌లో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు హెచ్ఎం జి.విజయభారతి తెలిపారు. జూన్ ఒకటో తేదీ నుంచి తరగతులు క్లాసులు మొదలవుతాయన్నారు. తమ కాలేజ్‌లో సీఈసీ, బైపీసీ కోర్సులు ఇంగ్లిష్ మీడియంలో అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధించనున్నట్లు వివరించారు. అలాగే ఇంటర్ ఫస్టియర్ తప్పిన బాలికలు సెకండియర్ చేరే అవకాశం ఉందన్నారు. ఎలాంటి ఫీజులు లేవని, అమ్మ ఒడి పథకం కూడా వర్తిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంత బాలికలు ఈ అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఇన్‌చార్జ్‌లు డి సుధీర్ సెల్‌నం: 9989203686, ఎ.అనురాధ సెల్‌నం: 9676613525 సంప్రదించాలని తెలిపారు.



జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పొందిన వారితో హెచ్ఎం భారతి, ఉపాధ్యాయులు

ఈ ఏడాది నుంచి పూర్తిగా ఇంగ్లిష్ మీడియంలో

ఇదే భవనంలో ఉన్న జెడ్పీ హైస్కూల్‌లో ఈ విద్యా సంవత్సరం నుంచి 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఇంగ్లిష్ మీడియంలో బోధన చేస్తున్నట్లు వెల్లడించారు. పాఠ్య, రాత పుస్తకాలు, 8వ తరగతి వారికి ట్యాబ్‌లు, ఐఎఫ్‌పీలతో అత్యున్నత ప్రమాణాలతో విద్యాబోధన అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. ప్రతిరోజు అదనపు తరగతుల నిర్వహణ కూడా ఉందన్నారు. ఈ ఏడాది ప్రకటించిన పదోతరగతి పరీక్ష ఫలితాల్లో తమ పాఠశాల 87 శాతం ఉత్తీర్ణత సాధించిందన్నారు.

పోషకాలతో కూడిన నాణ్యమైన భోజనాన్ని అందించాలి

మండల విద్యాశాఖ అధికారి-2 ఎస్.నాగేశ్వరరావు

నరసరావుపేట రూరల్: మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు పోషకాలతో కూడిన నాణ్యమైన భోజనాన్ని అందించాలని మండల విద్యాశాఖ అధికారి-2 ఎస్.నాగేశ్వర రావు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శంకర భారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం శిక్షణ, వంటల పోటీలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు దినసరి ఆహారంలో ఖచ్చితంగా అందించ వలసిన పోషకాలు, కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్స్, ఫాట్స్, విటమిన్స్, మినరల్స్ గురించి శిక్షణలో తెలియజేశారు.

పోషకాలు సరిపడా మోతాదులో అందకపోతే విద్యార్థులకు ఎదురయ్యే అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. వంట చేసే సమయంలో సదరు పోషకాలు కోల్పోకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలను తెలిపారు. గోరుముద్ద పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న మెనూ ద్వారా



వంటల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న విద్యాశాఖ అధికారులు

విద్యార్థులకు అవసరమైన పోషకాలను ప్రతిరోజు అందించే విధానాన్ని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఈవో కార్యాలయం ఏడీ బి.శ్రీనివాస రెడ్డి పాల్గొని వంటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయినీ పి.పార్వతి, కోటప్పకొండ హైస్కూల్ ప్రధానోపాధ్యాయినీ ఎస్.విజయలక్ష్మి, రొంపిచర్ల ఎంఈవో-2 డి.బ్రహ్మేశ్వరరావులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

చిలకలూరిపేటటౌన్: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. పట్టణంలోని రిజిస్టర్ ఆఫీసు ప్రక్కన ఉన్న శాఖా గ్రంథాలయంలో ఈ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా గ్రంథాలయ ఇంచార్జ్ అధికారి ఎం. నాగుల్ మీరావలి మాట్లాడుతూ గత నెలరోజుల నుంచి గ్రంథాలయంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. శిక్షణ తరగతులు ముగుస్తున్న నేపథ్యంలో ప్రతిరోజు విద్యార్థులకు వారు నేర్చుకున్న అంశాలపై పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు డా.పి.వి. సుబ్బారావు, దార్ల బుజ్జిబాబు, గోరంట్ల నారాయణ, చుక్కా విన్సెంట్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

వినుకొండ (నూజెండ్ల): పట్టణంలోని వినుకొండ శాఖ గ్రంథాలయలో వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ శాఖాధికారి భూక్యా బద్రీనాయక్ తెలిపారు. కథలు చదవడం, కథలు చెప్పడం మాకిష్టం అనే కార్యక్రమాలు, చిత్రలేఖనం, రంగు కాగితాలతో బొమ్మలు తయారు చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పార్శిల్ కార్యాలయాల్లో అధికారుల తనిఖీలు



నరసరావుపేట రూరల్: పట్టణంలోని పార్శిల్ కార్యాలయాలు, గొడన్‌ల్లో వ్యవసాయ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మస్తానమ్మ, ఏవో వి.నరేంద్రబాబులు ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించి ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల స్టాక్ బిల్లులను పరిశీలించారు. రైతులు లైసెన్స్ కలిగిన విత్తనాల దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని ఏడీఏ సూచించారు. విత్తనాలు కొనుగోలు సమయంలో రసీదు బిల్లును తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. పట్టణంలో, గ్రామాల్లో లైసెన్స్ లేకుండా అక్రమంగా విత్తనాలు నిల్వ చేస్తే వారి మీద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా కందుకూరి వీరేశలింగం వర్ధంతి

చిలకలూరిపేటటౌన్: స్థానిక స్వచ్ఛంద సేవా సంస్థ జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు 105వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ప్రముఖ సాహితీ విమర్శకులు డా.పి.వి. సుబ్బారావు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పాఠశాల స్థాయి విద్యార్థులకు ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణ్‌రావు సంకలనం చేసిన బాలల కోసం భారత రాజ్యాంగం పుస్తకాలను ఉచితంగా అందజేశారు. అనంతరం మాజీ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ దాసరి చిట్టిబాబు, రిటైర్డ్ ఎక్సైజ్ సీఐ గోరంట్ల నారాయణ, జెవీవీ పల్నాడు జిల్లా అధ్యక్షులు దార్ల బుజ్జిబాబు పాల్గొని ప్రసంగించిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు గేరా యాకోబు, కార్యదర్శి పొనుగుబాటి బుల్లిబాబు, సభ్యులు సాతులూరి వరబాబు, నాగరాజు, మాజీ సర్పంచ్ వడ్లన చంద్రం, కుల్లి రాజా, నలమాల దానయ్య, గ్రంథాలయ ఇంచార్జ్ అధికారి ఎం. నాగూర్ మీరావలి, సరోజిని, వివిధ పాఠశాలల టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పీవీ సుబ్బారావు

నూజెండ్ల మండలంలో రాళ్లు, కర్రలు స్వాధీనం

పలు ప్రాంతాల్లో పోలీసుల కార్డన్ సెర్చ్

వినుకొండ(నూజెండ్ల): నూజెండ మండలంలోని మార్రెళ్లవారిపాలెం, నూజెండ్ల గ్రామాల్లో రూరల్ సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. నూజెండ్లలో పలు ప్రాంతాల్లో గోతాల్లో దాచిన రాళ్లు, కర్రలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎరవైనా అలజడులు, అల్లర్లు సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మే 13న జంగాలపల్లిలో జరిగిన పోలింగ్‌లో ఏజెంట్లు నెట్టుకొని వీవీ ప్యాడ్‌పై పడగా వీవీ ప్యాడ్ పగిలిపోయిన సంఘటనలో 11మంది ఏజెంట్లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- కంది పంట సాగుకు వాతావరణం అనుకూలం
- వ్యవసాయాధికారి అమీర్‌రెడ్డి



దుర్గి: వర్షాధారంపై సాగు చేస్తున్న కంది పంటకు అనుకూల వాతావరణం నెలకొని ఉందని మండల వ్యవసాయాధికారి వై అమీర్‌రెడ్డి అన్నారు. సోమవారం పలు గ్రామాలలో పర్యటిస్తూ స్థానిక రైతులతో కలిసి ఆయన రాబోవు ఖరీఫ్‌కు సాగు చేస్తున్న పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు ఆయన సూచనలు చేస్తూ మంచి ధర, దిగుబడికి కంది పంట అనుకూలంగా ఉంటుందన్నారు. మండల వ్యాప్తంగా 10 వేల నుంచి 12 వేల హెక్టార్ల కంది సాగు చేసే అవకాశముందని తెలిపారు. తొలకరికి ముందే భారీ వర్షాలతో మండల వ్యాప్తంగా రైతులు పూర్తి వ్యవసాయ పనులలో నిమగ్నమయ్యారన్నారు. కొంత మేరకు పత్తి పంట సాగు చేశారని, మరిన్ని ఎకరాలలో పత్తి, కంది పంటలు సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారన్నారు. గత ఖరీఫ్‌లో కంది పంట రైతులకు మేలు చేకూర్చిందని, ఈ సంవత్సరం కూడా అటువంటి వాతావరణమే నెలకొందని, అధిక వ్యయంతో పెట్టుబడులు పెట్టి నష్టపోకుండా తక్కువ పెట్టుబడితో అధిక లాభం పొందే పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని కోరారు. పత్తి, మిర్చి విత్తనాలను స్థానిక డీలర్ల వద్ద కొనేటప్పుడు రైతులు తప్పనిసరిగా రశీదును పొందాలన్నారు. దీని వలన పంట వేసిన తరువాత నష్టపోయినా, ఇబ్బందులు వచ్చినా ఎరువులు, పురుగు మందులు నకిలీవి, కల్తీవి, కంపెనీ కానివి డీలర్ అమ్మితే ఆ రశీదు చూపించి అతని వద్ద నుంచి నష్టపరిహారం పొందటమే కాకుండా, ఆ షాపును సీజ్ చేసి, అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటానికి అవకాశముందన్నారు. రైతులు దీనిని గమనించి ప్రతి ఒక్కరూ రసీదును తప్పక పొందాలన్నారు. డీలర్ బిల్లు లేకపోతే తగ్గిస్తానని చెప్పినా రైతులు నమ్మవద్దని, ప్రభుత్వ నిబంధనలకనుగుణంగా రసీదు పొందితే రైతుకు లాభం ఉంటుందన్నారు.

అన్నమయ్యకు స్వరార్చన



నరసరావుపేట ఈస్ట్: పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్య జయంతిని పురస్కరించుకుని ఆదివారం రాత్రి శ్రీసీతారామస్వామి దేవస్థానం శ్రీనివాస కల్యాణ మండపంలో అన్నమయ్య స్వరార్చన కార్యక్రమం నిర్వహించారు. వాసవీ క్లబ్ గ్రేటర్, స్వరసుధ కళా సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గాయకులు కొత్తమాసు సుధాకర్ (నరసరావుపేట), భారతి (చిలకలూరిపేట) పాల్గొని అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మండవ సీతారామాంజనేయులు, ప్రవల్లిక సత్యం, శ్రీ వాసవీ మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, కె.కె.విశ్వనాధం, పెనుగొండ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. దాదాపు 3 గంటల పాటు అన్నమయ్య సంకీర్తనలు ఆలపించి భక్తులను రంజింప చేసిన గాయకులను ఘనంగా సత్కరించారు.

లయన్స్ క్లబ్ టౌన్ అధ్యక్షుడిగా కిషోర్‌కుమార్

సత్తెనపల్లి: లయన్స్ క్లబ్ సత్తెనపల్లి టౌన్ అధ్యక్షుడిగా పొన్నెకంటి కిషోర్ కుమార్‌ను ఎన్నుకున్నారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన లయన్స్ క్లబ్ కార్యవర్గ సమావేశంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్-2024-25 లయన్ స్టిక్ సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా బండ్లమూడి వీరాంజనేయులు, కోశాధికారిగా బత్తుల రోశయ్య, ఉపాధ్యక్షులుగా లయన్స్ పెద్దింటి వేంకటేశ్వర్లు, తిరుమల సాంబశివరావు, కొప్పురావూరి రాజశేఖర్, జాయింట్ సెక్రటరీగా తోట పద్మ, టైల్ ట్విస్టర్‌గా బండి విజయలక్ష్మి, లయన్ టీమర్‌గా వీవీ రామకృష్ణమాచార్యులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత అధ్యక్షుడు మంచికంటి వేంకటేశ్వరరావు, సీనియర్ లయన్స్ క్లబ్ మెంబర్స్ కంబాల వేంకటేశ్వరరావు, వై.పి.మురళీకృష్ణ, పెద్దింటి చంద్రయ్య, కోట వేంకటేశ్వర్లు, కంకణాల విష్ణువర్ధనరావు, కొండవీటి రాజు, తోట చినసాంబశివరావు, కొప్పురావూరి గురుప్రసాద్, గ్రంధిశిల శ్రీనివాసరావు, పెరుమాళ్ళ శ్రీనివాసరావు, పాతూరి రామకోటయ్య, తవిటి భావనారాయణ పాల్గొన్నారు. నూతన కార్యవర్గం జూలై 1వ తేదీ నుంచి కార్యాచరణలో కొనసాగనుంది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని పలువురు ప్రత్యేకంగా అభినందించారు.



పొన్నెకంటి, బండ్లమూడి, బత్తుల

రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించండి

వెల్దుర్తి: మండల పరిధిలోని ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు బత్తిన శ్రీరామ్ ఆధ్వర్యంలో నర్సులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండి వారికి కావాల్సిన వైద్య సేవలను తక్షణమే అందించే విధంగా చూడాలన్నారు. ప్రతినెలా జరిగే సమీక్ష సమావేశంలో భాగంగా పీహెచ్‌సీ పరిధిలోని 13 గ్రామాలకు చెందిన 12 మంది నర్సులకు ప్రజల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారికి కావల్సిన మందులను ఉచితంగా అందించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల గురించి ప్రజలకు వివరించి వారిని చైతన్యం చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం తీసుకునేలా సూచనలు చేయాలన్నారు. వారికి ప్రతి నెలా చేసే వైద్య పరీక్షలను సకాలంలో చేయాలన్నారు.



ఉప్పలపాడు పీహెచ్‌సీలో నర్సులతో సమీక్ష సమావేశంలో డాక్టర్ శ్రీరామ్

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు



గాయపడ్డ వంశీ

వినుకొండ(నూజెండ్ల): విద్యుత్ తీగలు తెగిపడటంతో యువకుడికి విద్యుదాఘాతమై గాయాలైన సంఘటన మండలంలోని గోనుగుంట్ల వారిపాలెంలో జరిగింది. గ్రామానికి చెందిన సల్లూరి వంశీపై ఇంటి వెనక ఉన్న కరెంటు తీగలు తెగి పడటంతో ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. 60 శాతం గాయాలైన వంశీని మెరుగైన చికిత్స కోసం నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ ఘోరం జరిగిందని వాపోతున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మాజీ ప్రధాని నెహ్రూకు ఘన నివాళి

సత్తెనపల్లి: భారతదేశ మొట్టమొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కాలంలో పంచవర్ష ప్రణాళిక అమలు చేయడం ద్వారా దేశం ఎంతో పురోగతి సాధించిందిదని కాంగ్రెస్ పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుక్కా చంద్రపాల్ అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 60వ వర్ధంతి కార్యక్రమం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజు పాల్ అధ్యక్షత సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. చంద్రపాల్ మాట్లాడుతూ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 1940వ సంవత్సరం ముందు స్వాతంత్ర ఉద్యమాల్లో పాల్గొని జైలు జీవితం గడిపారన్నారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి మాదంశెట్టి వేదాద్రి, కాంగ్రెస్ నాయకులు షేక్ అజీమ్, కోట ఆనంద్, షేక్ ఆరిఫ్, కోటంపాటి సాంబశివరావు, షేక్ సుభాని, పాల్గొన్నారు.



నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చంద్రపాల్, నాయకులు

నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకున్నాం

మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయ పరిధిలో అన్ని వార్డులకు మంచినీటి సరఫరా చేసేందుకు కార్యాచరణ చేపట్టామని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో నీటి ఎద్దడి లేకుండా చేసేందుకు చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు. కృష్ణా జలాలు పైపులైన్ ద్వారా ప్రజలకు అందిస్తున్నామన్నారు. పైపులైన్‌లు పూర్తికాని ప్రాంతాల్లో వాటర్ ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామన్నారు. అలాగే పట్టణంలోని వార్డులలో సమస్యలను ఆయా వార్డు కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వాటన్నిటిని పరిష్కరించే విధంగా అడుగులు వేస్తున్నామని చైర్మన్ తెలిపారు. అలాగే చిన్న చిన్న అభివృద్ధి పనుల్లో మున్సిపల్ అధికారులు త్వరలోనే చర్యలు చేపట్టటం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ జైలాబ్దిన్, కొమ్ము ముక్కంటి, మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఇద్దరికి ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్ల ప్రదానం

సత్తెనపల్లి: కళా, సాహితీ రంగాల్లో పట్టణానికి చెందిన కళాకారుడు బెజగం రవికుమార్, సాహితీవేత్త డాక్టర్ సరికొండ రమాదేవి ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్లు అందుకున్నారు. ఒంగోలు పట్టణంలో లిటిల్ చాంప్స్ అకాడమీ, కేఆర్ ఫౌండేషన్ సంయుక్తంగా మల్లయ్య లింగయ్య భవన్‌లో ఈ నెల 26న వివిధ రంగాల్లో ప్రతిభావంతులను గుర్తించి, ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్లను ప్రదానం చేసి, సత్కరించారు. వారిలో ఇద్దరు సత్తెనపల్లి వాసులు ఉండటం గమనార్హం. వారిద్దరినీ స్థానిక ప్రజలు ప్రత్యేకంగా సోమవారం అభినందించారు.



సత్కారం అందుకుంటున్న బెజగం రవికుమార్



డాక్టర్ రమాదేవి

బేకరీలో చోరీ

దాచేపల్లి: స్థానిక కారంపూడి రోడ్డులోని బెంగళూరు బేకరీలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తి బేకరీ వెనుక గోడను పగులగొట్టి అందులోకి ప్రవేశించాడు. సుమారు రూ.లక్ష నగదును చోరీ చేశాడు. ఈ దృశ్యాలు బేకరీలోని సీసీ కెమెరాలో నమోదయ్యాయి. బేకరీ నిర్వాహకుడు చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ దాసరి శివనాగరాజు చోరీ జరిగిన బేకరీలోని సీసీ కెమెరాలో నమోదు అయిన దృశ్యాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివనాగరాజు చెప్పారు.



విత్తన షాపుల్లో తనిఖీలు



మాచర్ల: పట్టణంలోని విత్తనాల షాపులను మాచర్ల వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు చేశారు. పత్తి ఫ్యాక్టరీ, అంబేద్కర్ సెంటర్ తదితర ప్రాంతాల్లో విత్తనాల షాపులను పరిశీలించారు. విత్తనాల షాపుల్లో బీజీ, బీజీ-4 పత్తి విత్తనాలు విక్రయించేవారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఆయా కంపెనీలకు సంబంధించిన ఫారం సీ పరిశీలన జరిపారు. రికార్డుల్లో వివరాలు నమోదు చేశారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలన్నారు. పంటకాలం పూర్తయ్యే వరకు రైతులు ఆ బిల్లులను భద్రపరచాలన్నారు. ప్రభుత్వం సూచించిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. ఎమ్మార్పీ ధరలకు మాత్రమే విత్తనాలు రైతులకు విక్రయించాలన్నారు. తనిఖీల్లో మండల వ్యవసాయ శాఖ అధికారి కట్టా లక్ష్మారెడ్డి, వ్యవసాయ విస్తీర్ణ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.